ఉన్నవే దిక్కులేదు.. చెంచు డిక్లరేషనా?

- సీఎం రేవంత్‌రెడ్డి ఏడాదిన్నర పాలనలో ఆదివాసీలు, చెంచులకు ఒరిగిందేమీ లేదు
- అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల
- ఆదివాసీలకు మంత్రిత్వ శాఖ శాఖ ఎందుకివ్వలేదు?
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- సీఎం రేవంత్‌వి మాయమాటలే
- మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు
- ఎస్సీ, ఎస్టీలకు మొండిచెయ్యి: బీఆర్ఎస్ నేత జాన్సన్ నాయక్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల. చిత్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే కాంతారావు

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన డిక్లరేషన్లకే దిక్కులేదు.. ఇప్పుడు నల్లమల డిక్లరేషనా?' అని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నిప్పులు చెరిగారు. నల్లమల బిడ్డనని గొప్పగా చెప్పుకొనే సీఎం రేవంత్‌రెడ్డి.. ఏడాదిన్నర పాలనలో అదే ప్రాంతంలో ఉంటున్న చెంచులు, ఆదివాసీలకు చేసిందేమీలేదని మండిపడ్డారు. మంగళవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, నాయకుడు జాన్సన్ నాయక్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మొన్న అచ్చంపేట నియోజకవర్గంలో ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన సభా వేదికపై ఆదివాసీలకు సీఎం చోటివ్వలేదని విమర్శించారు. సభకు రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలను తీసుకొచ్చి చెంచులను మాత్రం విస్మరించారని దుయ్యబట్టారు. సమస్యలు చెప్పుకొందామని వచ్చిన వారిని ఠాణాల్లో నిర్బంధించి ఇబ్బందులు పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గొప్పలు చెప్పుకోవడం తప్ప సీఎం రేవంత్‌రెడ్డి ఆచరణలో చేసేది శూన్యమని ఎద్దేవాచేశారు. కేసీఆర్ పాలనలోనే చెంచులు, ఆదివాసీలకు సముచిత గౌరవం దక్కిందని గుర్తుచేశారు. ఆరు లక్షల మందికి పోడు పట్టాలు ఇవ్వడమే గాకుండా రైతుబంధు, రైతుబీమా పథకాలను వర్తింపజేశారని, సాగు కోసం పంప్‌సెట్లు అందజేశారని చెప్పారు. నాడు ఎన్నికల కోడ్ కారణంగా 26 మందికి పోడు పట్టాలివ్వలేకపోయామని, నేడు రేవంత్‌రెడ్డి పట్టాలిచ్చి తన ఘనతగా చెప్పుకోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. కేసీఆర్ పాలనలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పచ్చగా మార్చేందుకు పాలమూరు ఎత్తిపోతలతోపాటు పలు రిజర్వాయర్లు నిర్మించారని చెప్పారు. అచ్చంపేటలో ఉమామహేశ్వర, చెన్నకేశవ రిజర్వాయర్ల నిర్మాణానికి సంకల్పించారని గుర్తుచేశారు. ఉమామహేశ్వర ప్రాజెక్టు కోసం రూ. 23,500 కోట్ల నిధులు కేటాయించి రూ. 16,500 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. కాంగ్రెస్ గద్దెనెక్కి 18 నెలలు దాటినా ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. నీళ్లివ్వడం మరిచిన ముఖ్యమంత్రి రేవంత్ సోలార్ పంప్‌సెట్లు ఇస్తే ఏం లాభమని నిలదీశారు.

కేసీఆర్ ఆనవాళ్లే అందాల పోటీలకు బ్రాండ్ అంబాసిడర్లు

కేసీఆర్ హయాంలో నిర్మించిన సెక్రటేరియట్, కమాండ్ కంట్రోల్ సెంటర్, యాదాద్రి ఆలయమే ఇప్పుడు రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న అందాలపోటీలకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాయని బాలరాజు చురకలంటించారు. 'కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన డిక్లరేషన్లన్నీ అటకెక్కాయి. ఇప్పుడు ఈ సర్కారు పని అయిపోయిందని ప్రజలే డిక్లేర్ చేస్తున్నరు' అని దెప్పిపొడిచారు. నల్లమలలో యురేనియం వెలికితీతను అడ్డుకున్నది బీఆర్ఎస్ సర్కారేనని స్పష్టం చేశారు. గత యూపీఏ ప్రభుత్వం ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రాకు చెందిన కంపెనీకి ఇక్కడి ఖనిజాలను దోచిపెట్టేందుకు కుట్ర చేసిందని విమర్శించారు. 'ఇప్పుడు రేవంత్ కన్ను ఆ సంపదపై పడ్డట్టున్నది. అందుకే పదేపదే ఇక్కడికి వచ్చి ఏదో ఉద్ధరిస్తున్నానని చెప్పుకొంటున్నరు. గువ్వల బాలరాజు బతికినంత వరకు.. బీఆర్ఎస్ ఉన్నంతవరకు నల్లమల సంపదను తాకట్టు పెట్టనిచ్చేది లేదు' అంటూ తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

దయ్యాలు వేదాలు వల్లించినట్టు : మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

కాంగ్రెస్ వచ్చిన తర్వాత గిరిజన, ఆదివాసీల బతుకులు ఆగమయ్యాయని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆవేదన వ్యక్తంచేశారు. గిరిజనులను ఆదుకుంటాం.. ఆదివాసీలను ఉద్ధరిస్తామని రేవంత్ చెప్తున్న మాటలు వింటుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉన్నదని ఎద్దేవాచేశారు. నాడు శాంతియుతంగా ఎక్కడా గొడవలు కాకుండా రెండు, మూడు ఎకరాల చొప్పున పోడు పట్టాలు పంపిణీ చేశామని గుర్తుచేశారు. గిరి గూడేలకు భగీరథ కింద మంచినీళ్లు అందించిన మహానుభావుడు కేసీఆర్ అని కొనియాడారు. రేవంత్ మాత్రం ఎకరం ఇచ్చి ఫోజులు కొడుతున్నారని విమర్శించారు.

మంత్రిత్వ శాఖ ఎందుకివ్వలే: ఎమ్మెల్యే కోవలక్ష్మి నిలదీత

అచ్చంపేట సభ సాక్షిగా ఆదివాసీలు, గిరిజనులపై ప్రేమ ఒలకబోసిన సీఎం రేవంత్‌రెడ్డి.. వారిపై నిజంగా అంత ప్రేమ ఉంటే గిరిజన మంత్రిత్వ శాఖ ఎందుకివ్వలేని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి ప్రశ్నించారు. 1981లో ఇంద్రవెల్లిలో ఆదివాసీ బిడ్డలను పొట్టనబెట్టుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తూర్పారబట్టారు. గిరిజన, ఆదివాసీలకు ఏదైనా మేలు జరిగిందంటే అది కేసీఆర్ పాలనలోనేని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ ఇప్పటికైనా అబద్ధాలు మానుకొని పాలనపై దృష్టిపెట్టాలని హితవు పలికారు.

ఎస్సీ, ఎస్టీలకు ఇబ్బందులు: జాన్సన్ నాయక్

కాంగ్రెస్ పాలనలో ఎస్సీ, ఎస్టీలకు ఒరిగిందేమీలేదని ఖానాపూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్ విమర్శించారు. వారి ఓట్లతో గద్దెనెక్కి ఇప్పుడు ఇక్కట్ల పాల్జేస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఆ పార్టీ నుంచి అనేక మంది గిరిజన బిడ్డలు ఎమ్మెల్యేలుగా గెలిచారని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ మాత్రం గిరిజన మంత్రిత్వ శాఖను ఆయన వద్దే పెట్టుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. హామీల ఊసెత్తకుండా ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ రోజులు గడుపుతున్నారని ఎద్దేవాచేశారు.

మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత వినోద్‌కుమార్

అందాల భామలకు 'అంబేద్కర్'ను ఎందుకు చూపించలేదు?

- అమరజ్యోతి వద్దకు ఎందుకు తీసుకెళ్లలేదు
- రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసిన బీ వినోద్‌కుమార్

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిర్వహిస్తున్న ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొంటున్న వారికి తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పునర్నిర్మించిన యాదగిరిగుట్ట, కొత్తగా నిర్మించిన కమాండ్ కంట్రోల్ భవనం, సెక్రటేరియట్‌తోపాటు రామోజీ ఫిల్మ్‌సిటీ, చౌమొహల్లా ప్యాలెస్, చార్మినార్, రామప్ప దేవాలయం తదితర కట్టడాలను చూపిస్తున్నారు తప్ప ప్రపంచంలోనే అత్యంత ఎత్తుగా కేసీఆరే నిర్మించిన.. 125 అడుగుల బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎందుకు చూపించడం లేదని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ ప్రశ్నించారు. అంబేద్కర్ విగ్రహం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు వివక్ష చూపుతున్నారని, ఇది దేనికి సంకేతమని నిలదీశారు. తెలంగాణ భావన్‌లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి, మలిదశ ఉద్యమంలో అసువులు బాసిన ఎందరో బలిదానాలకు గుర్తుగా కేసీఆర్ నిర్మించిన అమరజ్యోతి రాష్ట్రానికే గర్వకారణమని, అలాంటి అమరజ్యోతిని సందర్శించడానికి అందాల పోటీదారులను ఎందుకు తీసుకెళ్లడం లేదని ఆయన మండిపడ్డారు. ఈ నెల 31తో అందాల పోటీలు ముగుస్తాయని, ఆ తర్వాత.. జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున వారిని రాష్ట్ర గవర్నర్‌ను కలువడానికి తీసుకెళ్లడం సంతోషమే అని పేర్కొన్నారు. అయితే ఈలోగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించి.. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని, వారి జీవిత చరిత్రను.. ఆ పక్కనే ఉన్న అమరజ్యోతిని సందర్శింపజేసి, వాటి ప్రతిష్ఠ, ప్రాధాన్యతల గురించి అందాల పోటీదారులకు సమగ్రంగా వివరించాలని సూచించారు. కాళేశ్వరం కమిషన్ నోటీసులపై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. కమిషన్ నోటీసులు ఇచ్చినట్టు తెలిసిందని, మరి ఆ నోటీసులో ఏముందో తెలిసిన తర్వాతే స్పందిస్తామని ఆయన చెప్పారు.

సిరిసిల్ల కలెక్టర్‌పై ఎన్‌హెచ్చార్సీ ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి...

కూడుకొని ఉన్నదని కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము చెప్పినా సరైన విధంగా స్పందించలేదని, ఇలాగైతే తమ అధికారాలను ఉపయోగించాల్సి ఉంటుందని హెచ్చరించింది. అత్యంత అమానవీయ ఘటనపై జిల్లా ప్రభుత్వ యంత్రాంగం స్పందనలో లోపం ఉన్నదని ఆగ్రహం వ్యక్తంచేసింది. కుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, బాధితురాలి కుటుంబానికి నష్టపరిహారం చెల్లింపు తదితర అంశాల ప్రస్తావనే లేదని మండిపడింది. జూన్ 12లోగా తగిన వివరాలతో సమగ్ర నివేదిక పంపాలని మరోసారి ఆదేశించింది. లేదంటే మానవహక్కుల రక్షణకు సంబంధించి 1993 చట్టంలోని సెక్షన్ 13 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

ప్రశ్నిస్తే పోలీసులతో దాడులా?

ధర్మారం ఘటనను ఖండించిన బీఆర్ఎస్ నేతలు రాకేశ్‌కుమార్, గెల్లు, కురవ..



మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత రాకేశ్‌కుమార్. చిత్రంలో గెల్లు శ్రీనివాస్, విజయ్

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తే పోలీసులతో దాడులు చేస్తారా అంటూ బీఆర్ఎస్ పార్టీ నేత చిరుమళ్ల రాకేశ్‌కుమార్ ప్రశ్నించారు. నేతలు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, కురువ విజయ్‌తో కలిసి తెలంగాణభవన్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడారు. పెద్దపల్లి జిల్లా ధర్మారంలో బీఆర్ఎస్ నాయకులపై దాడిని తీవ్రంగా ఖండించారు. పోలీసులను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ నాయకులు దాడికి దిగారని మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ధర్మపురి నియోజకవర్గానికి ఎన్నో నిధులు తెచ్చి.. అన్ని విధాలా అభివృద్ధి చేసింది మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అని గుర్తు చేశారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఘోష్ కమిషన్ నోటీసుల పేరిట కాంగ్రెస్ మరో డైవర్షన్ డ్రామాకు తెరలేపిందని మండిపడ్డారు.

రజతోత్సవ వేడుకల ఏర్పాట్లు పరిశీలించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల తదితరులు

డాలస్‌లో బీఆర్ఎస్ జయకేతనం

మొదటిపేజీ తరువాయి...

తదితర దేశాలు, పలు గల్ఫ్ దేశాల్లోనూ బీఆర్ఎస్ రజతోత్సవాలను నిర్వహిస్తామని ముందుకు వచ్చాయి. గత నెల 27వ తేదీన హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో పార్టీ ఆవిర్భావ రజతోత్సవ వేడుకలకు పార్టీ అధినేత కేసీఆర్ అంకురార్పణ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, అన్ని వర్గాలను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వంచించిన తీరుతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో నాటి ఉద్యమ పరిస్థితులను మననం చేసుకోవడం, కేసీఆర్ నాయకత్వంలో పదేండ్లపాటు అద్భుతంగా పురోగమించిన తెలంగాణను స్మరించుకోవడం, భవిష్యత్ కార్యాచరణకు రంగం సిద్ధం చేసుకోవడం కోసం ప్రవాస తెలంగాణీయులు సమాయత్తం అవుతున్నారని జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

డాలస్‌లో ఏర్పాట్లపై సర్వత్రా ఆసక్తి

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని ఎన్నారైలు నిర్ధారణకు వస్తున్నారు. 14 ఏండ్లపాటు సుదీర్ఘ కాలం పోరాటం చేసి స్వరాష్ట్రాన్ని సాధించి, పదేండ్ల పాటు తెలంగాణను అన్నిరంగాల్లో దేశంలోనే నంబర్ 1గా నిలిపిన బీఆర్ఎస్ పాలనకు, రాష్ట్రంలో ప్రస్తుత కొనసాగుతున్న పాలనలో అన్నివర్గాలు, అన్ని రంగాలు పడుతున్న యాతనకు ప్రవాస తెలంగాణీయులు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ డాలస్‌లో రజతోత్సవాలను నిర్వహిస్తామని తేదీ ప్రకటించగానే ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాల్లో (యూఎస్ఏ)ని పలు దేశాల్లో ఉన్న తెలంగాణ ఎన్నారైలు సభకు హాజరయ్యేందుకు ఆసక్తిని చూపటమే కాకుండా స్వచ్ఛందంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆయా దేశాల్లో ఉన్న తెలంగాణ బిడ్డలు నాడు ఉద్యమంలో పాల్గొనేందుకు ఎట్లా అయితే ఆసక్తిని చూపారో... ఈ రజతోత్సవాలకు హాజరయ్యేందుకు అంతటి ఆసక్తిని చూపుతున్నారని తెలిపారు.

తెలంగాణ ఆత్మను ఆవిష్కరిస్తాం: మహేశ్ బిగాల,

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయని బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్నారై కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల తెలిపారు. అమెరికాలోని డాలస్ నగరంలోని డాక్టర్ పెప్పర్ అరినాలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన మంగళవారం పరిశీలించారు. తెలంగాణ ఆత్మను ఆవిష్కరించే రీతిలో పలు కార్యక్రమాలను చేపడుతున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్న నేపథ్యంలో యూఎస్ఏలో పలు ప్రాంతాల్లో ఉన్న తెలంగాణవాసులే కాకుండా తెలుగువారు పెద్దఎత్తున పాల్గొనేందుకు ఆసక్తిని చూపుతున్నట్టు ఆయన తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక కళాపరిషత్ ఆధ్వర్యంలో తెలంగాణ ధూం..ధాం నిర్వహించనున్నామని తెలిపారు. యూఎస్ఏలోని తెలంగాణ, తెలుగు ప్రజలు, బీఆర్ఎస్ అభిమానులు సహా తెలంగాణకు చెందిన పలు ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొనేందుకు ఇప్పటికే తమ సన్నద్ధతను తెలిపారని చెప్పారు. బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్నారై సెల్ యూఎస్ఏ అడ్వైజరీ బోర్డు చైర్మన్ తన్నీరు మహేశ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ అమెరికాలోని వివిధ రాష్ట్రాల బీఆర్ఎస్ మద్దతుదారులు, అనుబంధ సంఘాల సమన్వయంతో నిర్వహించే కార్యక్రమం చరిత్రలో నిలుస్తుందని తెలిపారు. గతనెల ఎల్కతుర్తిలో నిర్వహించినట్టుగానే డాలస్‌లో వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. బీఆర్ఎస్ యూఎస్ఏ నాయకులు శ్రీనివాస్ సురభి, హరీశ్‌రెడ్డి, శ్రీనివాస్ సురకంటి పాల్గొన్నారు.

అధికారులు.. స్థాయిని దిగజార్చుకోవద్దు

మొదటిపేజీ తరువాయి...

కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం కీలక ఆదేశాలు జారీచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా మాచారంలో ఇందిర సౌర గిరి జలవికాసం పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఐఏఎస్ అధికారి, ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ శరత్ సీఎంను ప్రశంసలతో ముంచెత్తడమే కాకుండా ఆయన కాళ్లు మొక్కారు. ఇది తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో ఐఏఎస్ అధికారులు స్థాయిని మరిచి రాజకీయాల్లో భాగమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న సీఎస్ రామకృష్ణారావు కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఐఏఎస్‌లను, ప్రభుత్వ ఉద్యోగులను దారిలో పెట్టడమే లక్ష్యంగా ఆదేశాలు జారీచేశారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులు బహిరంగ సభలు, సమావేశాల్లో స్థాయికి తగని పనులు చేస్తున్నారని, ఇవి ప్రజల్లో అధికారులపై చులకనభావాన్ని ఏర్పరుస్తున్నాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ 1964 లోని రూల్-3 నిబంధన.. ప్రతి ఉద్యోగి విధికి అంకితమై, సంపూర్ణ క్రమశిక్షణ, నిష్పక్షపాతంగా పని చేయాలని సూచిస్తుందని, దీన్ని మరువొద్దని సూచించారు. ఇకపై ఐఏఎస్ అధికారులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు సభలు, సమావేశాల్లో నిబంధనలకు విరుద్ధంగా, హోదాను మరిచి వ్యవహరించినా, మాట్లాడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీఎం కాళ్లు మొక్కి గిరిజన జాతి ఇజ్జత్ తీస్తరా?

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్ ఆగ్రహం

షాద్‌నగర్, మే 20 : గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్‌నాయక్ సీఎం రేవంత్ కాళ్లు మొక్కి బంజారా బిడ్డల ఇజ్జత్ తీశారని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ ఆగ్రహం వ్యక్తంచేశారు. శరత్‌నాయక్ వ్యవహరించిన తీరు బంజారా జాతిలో ఐఏఎస్ వ్యవస్థ ప్రాతినిధ్యానికి మాయని మచ్చ అని తెలిపారు. ఇలాంటి చర్యలతో ఐఏఎస్ అయినా.. రాజకీయ నాయకుల కాళ్లు మొక్కాలా ? అనే భావనలో యువత ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. శరత్‌నాయక్ తక్షణమే ఉద్యోగానికి రాజీనా మా చేసి, లంబాడా గిరిజనులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ దాడి

- అభివృద్ధిపై సవాల్ విసిరి.. చర్చకు వస్తే దాడికి యత్నం
- పెద్దపల్లి జిల్లా ధర్మారంలో ఉద్రిక్త పరిస్థితులు

పెద్దపల్లి జిల్లా ధర్మారంలో బీఆర్ఎస్ నాయకుల వైపు దూసుకువస్తున్న కాంగ్రెస్ నాయకులను అదుపు చేస్తున్న పోలీసులు

ధర్మారం, మే 20: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి దిగాయి. ధర్మారం మండలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎలాంటి అభివృద్ధి చేయలేదని కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యానించడంతో పాటు చర్చకు రావాలని బీఆర్ఎస్ నేతలకు ఇటీవల సవాల్ విసిరారు. దీనిపై బీఆర్ఎస్ నాయకులు స్పందించి, మంగళవారం ధర్మారంలోని అంబేద్కర్ విగ్రహం సాక్షిగా చర్చకు సిద్ధమని ప్రకటించారు. ఈ మేరకు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాచూరి శ్రీధర్, నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గుర్రం మోహన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పూస్కూరు రామారావు, పాకాల రాజయ్య, ఆవుల శ్రీనివాస్, ఆవుల వేణు, మహిళా నాయకురాలు ఆవుల లత, గుజ్జేటి కనకలక్ష్మి, మార్క సంధ్య, దేవి రేణుక కాంపల్లి అపర్ణ తదితరుల ఆధ్వర్యంలో పార్టీ నాయకుడు రామారావు ఇంటి నుంచి ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తాకు బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు ర్యాలీగా వెళ్తున్న పలువురు ముఖ్య నాయకులను అడ్డుకున్నారు. అయినప్పటికీ పెద్ద సంఖ్యలో గులాబీ శ్రేణులు అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. కరీంనగర్ -రాయపట్నం రహదారిపై రాస్తారోకో చేసే ప్రయత్నం చేయగా, పోలీసులు అడ్డుకున్నారు. కాగా, సీఐ మాత్రం మిగతా ముఖ్య నాయకులను కేడీసీసీ బ్యాంకు వద్ద నిలిపివేసి, అంబేద్కర్ చౌరస్తాకు వెళ్లవద్దని సర్దిచెప్పారు. సీఐ విజ్ఞప్తి చేయడం, పార్టీ ముఖ్య నాయకుల పిలుపు మేరకు అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న బీఆర్ఎస్ శ్రేణులందరూ కేడీసీసీ బ్యాంకు వద్దకు చేరుకున్నారు. అక్కడ బీఆర్ఎస్ నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించడానికి సిద్ధమవుతున్న క్రమంలో కాంగ్రెస్ నాయకులు దాడికి ప్రయత్నించారు. ఇరువర్గాలను పోలీసులు అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ - రాయపట్నం రహదారిపై గంటసేపు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అనంతరం పోలీసులు బీఆర్ఎస్ నాయకులను పాత బస్టాండ్ వైపు, కాంగ్రెస్ నాయకులను అంబేద్కర్ చౌరస్తా వైపునకు మళ్లించారు.

ప్రజాపాలన కాదు.. రాక్షస పాలన: మాజీ మంత్రి కొప్పుల

ధర్మపురి నియోజకవర్గంలో రాక్షస పాలన నడుస్తున్నదని రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. ధర్మారం మండలంలో బీఆర్ఎస్ శ్రేణులపై దాడికి యత్నించడాన్ని మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్రాన్ని పదేండ్లపాలనలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన నాయకుడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. అధికారం కోసం ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. నిజంగా కాంగ్రెస్ నాయకులకు నీతి, నిజాయితీ ఉంటే, ప్రజలు, తమ పార్టీ నాయకులు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ధర్మపురి ఎమ్మెల్యేగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గెలిచి ఏడాదిన్నర కావస్తున్నా ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదని, తట్టెడు మట్టి తీయలేదని ఆరోపించారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం దగ్గర పైసలు లేవని, తనను కోసినా ఒక్క పైసా లేదని అంటున్నారని, దీనిని బట్టి కాంగ్రెస్ పరిస్థితి ఏంటో అర్థమైతున్నదని ఆగ్రహించారు. ధర్మపురి నియోజకవర్గంలో ఏడాదిన్నరలో ఏం సాధించారో, ఏం పనులు చేశారో చెప్పకుండా కాంగ్రెస్ నాయకులు ఎందుకు రెచ్చిపోతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలను ఎవరూ క్షమించరని, పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాను ఎలాంటి కక్ష సాధించలేదని గుర్తు చేశారు.

దౌర్జన్యాలకు భయపడే ప్రసక్తే లేదు

కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యాలు, బెదిరింపులు, కేసులకు భయపడే ప్రసక్తే లేదు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధర్మారం మండలంలో పదేండ్లలో చేసిన అభివృద్ధిపై చర్చించే దమ్ము లేక దాడికి దిగారు. ఈ దౌర్జన్యాన్ని ఖండిస్తున్నాం.

-రాచూరి శ్రీధర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు

సీఎం కాళ్లు మొక్కడం బంజారాలకే అవమానం

- బంజారాల గౌరవాన్ని తాకట్టు పెట్టిన కమిషనర్ శరత్
- ఆయన వెంటనే బంజారా జాతికి క్షమాపణ చెప్పాలి
- గిరిజన చైతన్య వేదిక అధ్యక్షుడు రాజునాయక్ డిమాండ్

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ) : అచ్చంపేటలో సోమవారం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన బహిరంగ సభలో గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ శరత్‌కుమార్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాళ్లు మొక్కి బంజరా జాతి ఆత్మగౌరవాన్ని దిగజార్చారని గిరిజన చైతన్య వేదిక అధ్యక్షుడు, ఓయూ జేఏసీ చైర్మన్ కరాటే రాజునాయక్ తీవ్రంగా మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక ప్రభుత్వశాఖకు కమిషనర్‌గా అత్యున్నత హోదాలో ఉన్న అధికారి రాజకీయ నాయకుడి కాళ్లు మొక్కి గిరిజనజాతి గౌరవాన్ని, అధికార వ్యవస్థ ఆత్మాభిమానాన్ని కించపరిచారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ చర్య బంజారా జాతికి, భారత రాజ్యాంగానికి తీరని అవమానంగా ఆయన పేర్కొన్నారు. బంజారా బిడ్డలు ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఎదగాలని తమ జాతి ఆకాంక్షిస్తుంటే.. శరత్‌నాయక్ లాంటి అధికారులు దిగజారుడు తనంతో జాతి తలదించుకునేలా చేస్తున్నారని ధ్వజమెత్తారు. శరత్‌నాయక్ వెంటనే తన ఉద్యోగానికి రాజీనామా చేయాలని, బంజారాజాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అతన్ని లంబాడా జాతి నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు.

వేగంగా కదులుతున్న నైరుతి

- నాలుగైదు రోజుల్లోనే కేరళను తాకే అవకాశ